
నమస్తే తెలంగాణ
# వరంగల్
5 | వరంగల్, శుక్రవారం 8 నవంబర్ 2024 | WARANGAL



కాళేశ్వరం, ముక్తీశ్వర ఆలయం

# కాళేశ్వరం.. ప్రగతి సుదూరం

## ఆలయంలో అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే

నాడు కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించి రూ. 25 కోట్లు మంజూరు

పది నెలల్లో పైసా విదల్చని కాంగ్రెస్ సర్కారు

- మేలో సరస్వతీ పుష్కరాలు.. అప్పటికైనా పనులు పూర్తయ్యేనా?
- ఇన్‌చార్జి ఈవోనే దిక్కు.. పాలకవర్గ నియామకమెప్పుడో?
- మంత్రి శ్రీధర్‌బాబు ఇలాకాలో ఇదీ పరిస్థితి

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ ప్రగతి ఆశాజనకంగా లేదు. అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించి 2016లో రూ. 25 కోట్లు మంజూరు చేయగా అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయి. అధికారంలో కి వచ్చిన కాంగ్రెస్ సర్కారు పది నెలల్లో పైసా విదల్చకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. అదేవిధంగా ఆలయ పాలకవర్గం పదవీకాలం పూర్తయి ఏడాది సమీపిస్తున్నా దానికి ఇంత వరకు మోక్షం లేదు. మరోవైపు ఇన్‌చార్జి ఈవోనే దిక్కయ్యారు. ఇదీ మంత్రి శ్రీధర్‌బాబు ఇలాకాలో నెలకొన్న దుస్థితి. మేలో సరస్వతీ పుష్కరాలు ప్రారంభం కానుండగా, ఈ లోగా ప్రభు త్వం నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

- జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ)

మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసి 32 పనులు చేపట్టి, వీటి పర్యవేక్షణ బాధ్యతలను దేవాదాయ, పంచాయతీరాజ్, అటవీ, ఉద్యానశాఖ, సులభ్ ఇంటర్నేషనల్ సంస్థకు అప్పగించింది. ఆలయం ఎంట్రన్స్‌కు ముందు ఫ్లోరింగ్, కిచెన్ హాలు, యాత్రికుల కోసం 15 గదులతో సముదాయం, క్యూ, షాపింగ్ కాంప్లెక్స్, పదిహేను గదులతో అపర కర్మ మండపం, వంద గదులతో ధర్మశాల, నలభై గదులతో డార్మిటరీ హాల్, గోదావరి స్నానఘట్టాల నుంచి బస్‌స్టేషన్ వరకు చేపట్టే డ్రైనేజీ, రోడ్డు నిర్మాణం, ఆలయం చుట్టూ ప్రహరీ, తదితర పనులకు నిధులు మంజూరు చేయగా, కొన్ని సాంకేతిక కారణాలతో ప్రారంభం కాకపోగా అధిక శాతం పనులు చివరి దశకు చేరుకున్నాయి.

**వంద గదులతో ధర్మశాల**

రూ. 8 కోట్లతో ఆలయం సమీపంలో భక్తుల సౌకర్యార్థం వంద గదులతో ధర్మశాల నిర్మాణం చేపట్టారు. ఈ భవనంతో పాటు రూ.1.25 కోట్లతో చేపట్టిన 40 గదుల డార్మెటరీ హాలు పనులు 90 శాతం పూర్తయ్యాయి. రూ. 1.10 కోట్లతో నిర్మించిన కిచెన్, అన్నదానం హాలు, రూ. కోటితో ఏర్పాటు చేసిన క్యూ కాంప్లెక్స్ పనులు పూర్తి చేసి ప్రారంభించారు. అపర కర్మ మండపానికి రూ.1.50 కోట్లు మంజూరు చేయగా స్థల సమస్యతో పనులు ప్రారంభం కాలేదు. రూ.50 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, రూ. 3.75 కోట్లతో అనిశెట్టి మండపం, రూ. 40 లక్షలతో అభిషేకం మండపం, రూ.11 లక్షలతో పాకశాల అభివృద్ధి, రూ.19 లక్షలతో శివ కల్యాణ మండపం, రూ.26 లక్షలతో రామాలయం ప్రహరీ, కొత్త ధ్వజ స్తంభం, రాజగోపురాలకు కర్ర డోర్లు, సాలహారం, సరస్వతీ ఆలయ ప్రహరీ తదితర పనులు సైతం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాల్సి ఉంది.



వంద గదులతో నిర్మించిన ధర్మశాల

**ఆలయ అభివృద్ధి పట్టదా ?**

రాష్ట్రంలో కాళేశ్వర ముక్తీశ్వర దేవాలయానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ ఆలయంపై పాలకులు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెండింగ్ పనులు కూడా పూర్తి చేయరా అని మండిపడుతున్నారు. పదినెలల కాలంలో కనీసం పాలకవర్గాన్ని ఎన్నిక చేయలేని, పర్మినెంట్ ఈవోను నియమించలేని ఈ పాలకులు ఆలయ అభివృద్ధిని ఏం చేస్తారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి సొంత నియోజక వర్గంలో నిధుల కొరతతో అభివృద్ధి పనులు ఆగిపోవడం గమనార్హం.



గూడూరు కొనుగోలు కేంద్రంలో మిల్లులకు తరలిస్తున్న ధాన్యం

# మిల్లర్ల కోతలు.. రైతుల వెతలు

- 40 కిలోల ధాన్యం బస్తాకు 2 కిలోలు తరుగు
- మిల్లర్లు చెప్పినట్లు వినాలంటూ వ్యవసాయాధికారుల హుకుం

కమలాపూర్, నవంబర్ 7 : కమలాపూర్ మండలంలో ధాన్యం కొనుగోలులో రైస్‌మిల్లర్లు కోత పెడుతూ రైతులను గోసపెడుతున్నారు. మిల్లర్లు చెప్పినట్లు వినాలంటూ వ్యవసాయాధికారులు హుకుం జారీ చేస్తున్నారు. 40 కిలోల బస్తాకు 2 కిలోలు కోత పెడుతుండడంతో క్వింటాలు ధాన్యానికి ఐదు కిలోలు కోత పడుతుందని రైతులు లబోదిబోమంటున్నారు. ప్రశ్నించిన రైతును ధాన్యం బాగా లేదు నీ ఇష్టం ఉన్నచోట అమ్ముకొమ్మని రైస్‌మిల్లర్ రిజెక్ట్ చేస్తున్నాడని వాపోతున్నారు. 40 కిలోల బస్తాకు కిలో మాత్రమే తరుగు తీయాలని సివిల్ సప్లయ్ అధికారులు నిర్ణయిస్తే రైస్‌మిల్లర్లు మాత్రం 2 కిలోలు కోత పెడుతున్నారు. ఓ రైతు 139 క్వింటాళ్ల 44 కిలోల ధాన్యం తేగా, 2 కిలోలు కోత పెడితే 6 క్వింటాళ్ల 64 కిలోలు కోతపెట్టారు. సన్నరకానికి ప్రభుత్వం బోనస్ పేరుతో తేమశాతం, ప్యాడీ క్లీనర్‌తో తాలుపట్టడం వంటి నిబంధనలు పెట్టడంతో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 40 కిలోల బస్తాకు కిలో మాత్రమే తరుగు తీయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**మూడు రైస్ మిల్లులకు కేటాయింపు**

మండలంలోని 23 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మూడు రైస్‌మిల్లులకు కేటాయించారు. రైస్‌మిల్లర్లు అధికారులు నిర్ణయించిన కిలో కాకుండా 2కిలోలు కోత పెడుతుండడంతో క్వింటా ధాన్యానికి 5కిలోలు పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సన్నరకం ధాన్యం ఎంపిక చేయడంలో వ్యవసాయాధికారులు ఇబ్బందులు పెడుతున్నట్లు రైతులు వాపోయారు. ఈ విషయమై సివిల్ సప్లయ్ డీటీ రమేశ్‌ను వివరణ కోరగా కిలోమాత్రమే తరుగు తీయాలని మిల్లర్లను ఆదేశించినట్లు చెప్పారు.

# నేటి నుంచి నిట్‌లో టెక్నోజియాన్-24

- మూడు రోజుల పాటు నిర్వహణ
- పాల్గొననున్న 5 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు
- 50కిపైగా ఈవెంట్ల ప్రదర్శన



వరంగల్ నిట్ క్యాంపస్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 7: దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద సాంకేతికోత్సవంగా పేరుగాంచిన టెక్నోజియాన్-24కు వరంగల్ నిట్ ముస్తాబైంది. ఈనెల 8 నుంచి 10 వరకు నిర్వహించేందుకు విద్యార్థులు ఏర్పాట్లు చేశారు. టెక్నోజియాన్‌కు దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీ రింగ్ కాలేజీ నుంచి సుమారు 5 వేల మందికిపైగా విద్యార్థులు పాల్గొననున్నారు. 2006 నుంచి ప్రతి ఏడాది వరంగల్ నిట్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మతక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడనుంది. విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహించే ఈ టెక్నోజియాన్‌లో ప్రతి ఏడాది ఒక కొత్త థీమ్‌తో వేడుకలను నిర్వహించనున్నారు. ఈ ఏడాది థీమ్‌ను ఆవిష్కరించనున్నారు.

**రెండు రోజులు 50కిపైగా ఈవెంట్లు..**

రెండ్రోజుల్లో విద్యార్థులు 50కిపైగా ఈవెంట్లు ప్రదర్శించనున్నారు. స్పాట్‌లైట్స్ పేరిట జహాజ్, ఆర్సీ భగ్గీ, హోవర్ మానియా, వర్చువల్ రియాల్టీ, డ్రోన్స్ రేసింగ్, బిల్డ్ యువర్ ఓన్ డ్రోన్, మూమ్యాట్‌ల్యాబ్స్, టీ వర్క్స్, ఈ-గేమ్స్, ట్రెజర్ హంట్, హాకథాన్ తదితర అంశాలతో 50కిపైగా ఈవెంట్లతో నిట్ సందడిగా మారనుంది. వీటితో పాటు ప్రముఖ దర్శకులతో చిట్‌చాట్‌తో సందడి చేయనున్నారు. వేడుకలను నేటి సాయంత్రం 4 గంటలకు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి లాంఛనంగా ప్రారంభించనున్నారు.

# 'సూపర్ స్పెషాలిటీ'లో తలసేమియా వార్డు

## ఏర్పాటుకు హాస్పిటల్‌ను సందర్శించిన వైద్యాధికారులు



కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వార్డును పరిశీలిస్తున్న వైద్యాధికారులు

వరంగల్ చౌరస్తా, నవంబర్ 7 : కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో తలసేమియా వార్డు ఏర్పాటుకు హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించడంతో వైద్యాధికారులు దవాఖానను సందర్శించారు. గురువారం ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య హాస్పిటల్‌లో అనువుగా ఉన్న వార్డును పరిశీలించారు. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా హనుమకొండ జిల్లాకు మంజూరైన తలసేమియా కేంద్రాన్ని కాకతీయ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసి చిన్నారులకు మెరుగైన చికిత్స అందించనున్నారు.

**ఫెడ్‌సేఫ్టీ ల్యాబరేటరీకి సైతం**

ప్రజలకు అందుతున్న ఆహార భద్రతా ప్రమాణాలను పరీక్షించే ల్యాబరేటరీని కాకతీయ మెడి కల్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేయనున్నారు. అందుకు అనువైన భవనం పరిశీలించి నివేదిక ను అందించాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించడంతో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి అప్పయ్య కేఎంసీలో తాత్కాలిక కాళోజీ హెల్త్ యూనివర్సిటీ కార్యాలయం ఏర్పాటు చేసిన భవనంతో పాటుగా గెస్ట్‌హౌస్‌ని పరిశీలించారు. ల్యాబరేటరీ అవసరాలకు తగి నంత విస్తీర్ణంలో భవనాలు అందుబాటులో లేకపోవడంతో నూతన భవనం నిర్మించే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

# నెరవేరనున్న ఓరుగల్లువాసుల కల

- అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌గా మామునూరు అడుగులు
- భూములు అప్పగించేందుకు అంగీకరించిన రైతులకు కృతజ్ఞతలు
- మంత్రి కొండా సురేఖ



గుంటూరుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

సంగెం, నవంబర్ 7 : ఓరుగల్లు వాసుల గగనయానం కల త్వరలో నెరవేరనున్నదని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి కొండా సురేఖ అన్నారు. 253 ఎకరాల భూసేకరణ నిమిత్తం గురువారం మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను వరంగల్ ఎంపీ కడియం కావ్య, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, పరకాల, వర్ధన్నపేట, పశ్చిమ ఎమ్మె ల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారదతో కలిసి పరిశీలించారు. అనంతరం గుంటూరుపల్లి గ్రామంలో గాడిపల్లి, నక్కలపల్లి రైతులతో మాట్లాడారు. అంతర్జాతీయ ఎయిర్ పోర్టుగా మామునూరును తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నామని, ప్రయాణికుల సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా ప్రణాళికల రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు పక్కనే ఉన్నందున ఎయిర్‌పోర్టు సర్వీ సులు ప్రారంభమైతే వరంగల్ ప్రగతిలో దూసుకపోతుందని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూములు అప్పగించేందుకు అంగీకరించిన రైతులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. వారికి మార్కెట్ విలువ ప్రకారం పరి హారం చెల్లిస్తామని తెలిపారు. భూమిని కోల్పోతున్న 233 మంది రైతులు, ప్లాట్ల యజమానులతో చర్చించి వారి అభిప్రాయాల మేరకు ఇతర భూమి కేటాయించి, మౌలిక సదుపాయాలను కల్పిస్తామని మంత్రి సురేఖ హామీ ఇచ్చారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ విమానాశ్రయం ఏర్పాటుతో వరంగల్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన, అరుణ, చింతాకుల అనిల్, సురేష్‌జోషితో పాటు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగేంద ర్‌రావు, ఈఈ జితేందర్‌రెడ్డి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ములుగు సర్కిల్ ఏర్పాటుకు అనుమతి

## మంజూరు చేసిన ఎన్పీడీసీఎల్

నమస్తే ఎఫెక్ట్

హనుమకొండ, నవంబర్ 7: ఎన్పీడీసీఎల్ ములుగు కొత్త సర్కిల్, ఏటూరునాగారం డివిజన్ ఏర్పాటుకు యాజమాన్యం అనుమతులు మంజూరు చేసిందని ఎస్‌ఈ టీ మధుసూదన్ తెలి పారు. గురువారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'మంత్రి చెప్పినా అతీగతీలేదు.. ఎన్పీ డీసీఎల్ సర్కిల్ ఏర్పాటు జాప్యం' కథనానికి ఎన్పీడీసీఎల్ అధికారులు స్పందించారు. కొత్త సర్కిల్‌గా రూపొందించాలంటే అందుకు కొత్త పోస్టులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ విభాగంలో ఆపరేషన్ ఎస్‌ఈ, టెక్నికల్, కన్‌స్ట్రక్షన్ డివిజనల్ ఇంజినీర్, క్వాలిటీ కంట్రోల్, డీపీఈ, సీనియర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్, అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో పర్సనల్ ఆఫీసర్ తదితర పోస్టులు ఏర్పాటు అవసరమన్నారు. కొత్త పోస్టులు లేకుండా ప్రత్యేకంగా ములుగులో సర్కిల్ స్థాపించడం వల్ల ఉన్న స్టాఫ్‌పై పనిభారం పడుతుందని, తద్వారా వినియోగదారులకు అందించే సేవలు సజావుగా జరగవని వివరించారు. కొత్త పోస్టుల మంజూరు అనుమతి రాగానే సర్కిల్, డివిజన్ ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈ తెలిపారు.

# డాబాపై గంజాయి మొక్కల పెంపకం


## జైలు పాలైన శివనగర్‌వాసి




ఇంటి డాబాపై గంజాయి కుండీలను పరిశీలిస్తున్న పోలీసులు

ఖిలావరంగల్, నవంబర్ 7: సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో మేడపై గంజాయి మొక్కలు పెంచిన ఓ వ్యక్తి జైలు పాలయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టాయి. ప్రయాణికుల బ్యాగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ క్రమంలో శివనగర్‌లో పల్లె బోయిన కుమార్ తన ఇంటి మేడపై పూలకుండీల్లో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు తెలుసుకున్నారు. దీంతో పోలీసులు సోదాలు చేసి మొక్కలను స్వాధీనం చేసుకొని కుమార్‌ను మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. తనిఖీల్లో యాంటీ డ్రగ్స్ టీం ఇన్‌స్పెక్టర్ జే సురేశ్, ఆర్ఐ శివకేశవులు, ఎస్సై చాంద్‌పాషా పాల్గొన్నారు.

# ● ఏజెన్సీని కమ్మేసిన పొగమంచు



లక్నవరంలో వేలాడే వంతెనను కమ్మేసిన పొగమంచు



జాతీయ రహదారిని కమ్మేసిన పొగమంచు

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని జాతీయ రహదారి(163)ని పొగమంచు కమ్మేసింది. దీంతో వాహనదారులు ఉదయం 8 గంటల వరకు కూడా వాహనాల లైట్లు వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పర్యాటక ప్రాంతమైన లక్నవరం సరస్సులో వేలాడే వంతెనలపై పొగమంచు పరుచుకుంది. ఈ దృశ్యాలు చూపరులను అలరించాయి.

- గోవిందరావుపేట, నవంబర్ 7

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- అపరిచితులకు ఖాతా వివరాలు చెప్పొద్దు
- డబ్బులు పోతే 1930 నంబర్‌కు కాల్ చేయాలి
- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డివిజనల్ జనరల్ మేనేజర్ ఘన్‌శ్యామ్ సోలంకి




మాట్లాడుతున్న డీజీఎం ఘన్‌శ్యామ్ సోలంకి

వరంగల్‌చౌరస్తా, నవంబర్ 7: బ్యాంకు ఖాతాదారులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డివిజినల్ జనరల్ మేనేజర్ ఘన్‌శ్యామ్ సోలంకి అన్నారు. వరంగల్‌లోని ఐఎంఏ భవనంలో గురువారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రీజినల్ మేనేజర్ విష్ణువర్ధన్ అధ్యక్షతన వినియోగదారులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఖాతాదారులు అకౌంట్ నంబర్లు, పాస్‌వర్డులు, పిన్ నంబర్లను ఇతరులకు తెలుపొద్దన్నారు. తప్పుడు సమాచారం వల్ల ఖాతాలోని నగదు పోయినా వెంటనే 1930కి డయల్ లేదా WWW.cybercrime.gov.inలో లాగిన్ అయి ఖాతా వివరాలు తెలియజేస్తే చెల్లింపులను నిలిపివేయడా నికి ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ పృథ్వీరాజ్, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, డీఆర్డీవో రేణుక, నాబార్డ్ ఏజీఎం టీ రవి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు

# పట్టాలున్న రైతులందరికీ రుణాలివ్వాలి

## తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట బీఆర్‌ఎస్ ధర్నా

మహాముత్తారం, నవంబర్ 7 : పట్టాలున్న రైతులకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రుణాలు, ఆర్‌వోఎఫ్‌ఆర్‌కు రెన్యూవల్ చేయడంలేదని బీఆర్‌ఎస్ మండల విభాగం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం లంబాడా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ బ్యాంకు నిల్వ కంటే అప్పులే ఎక్కువ ఉన్నాయని, తమ టార్గెట్‌కు మించి పంట రుణాలు ఇచ్చామని మేనేజర్ చెప్తున్నాడన్నారు. ప్రభుత్వం, తమ పై అధికారుల నుంచి రుణాలు ఇవ్వొద్దని ఆదేశాలు ఉన్నాయని ఆయన చెప్పాడన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తమకు రుణాలివ్వడంలేదని అర్థమవుతుందన్నారు. అనంతరం అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మార్క రాముగౌడ్, రాధారస్వామి, శ్రీపతి సురేశ్, జగపతి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్, జిల్లా కమిటీ సభ్యులు తడండ్ల శ్రీను, కుమ్మరి గణేశ్ పాల్గొన్నారు.

# అయ్యప్ప భక్తులకు ప్రత్యేక బస్సులు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 7 : ఆర్టీసీ వరంగల్ రీజియన్ నుంచి అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలకు ప్రత్యేక ఏసీ, నాన్ ఏసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు రీజనల్ మేనేజర్ డీ విజయభాను తెలిపారు. మీరు కోరుకున్న ప్రదేశం నుంచి మీరు దర్శించుకోవాల్సిన పుణ్య క్షేత్రాల మీదుగా నడుపుతామని, వీటిలో ఒక గురుస్వామితో పాటు ఇద్దరు వంటవాళ్లు, ఇద్దరు మణికంఠ స్వాములు, ఒక అటెండర్ ఫ్రీగా ప్రయాణించే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. ఈ బస్సులు బుక్ చేసిన గురుస్వామికి ఉచిత ప్రయాణంతో పాటు ఒకటి కంటే ఎక్కువ బస్సు లు బుక్ చేసిన గురుస్వామికి రూ.300 కమీషన్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. బస్సుల వారీ గా చార్జీల వివరాలు.. రాజధాని ఏసీ కిలోమీటర్‌కి రూ.77, సూపర్ లగ్జరీకి రూ.59, డీలక్స్‌కు రూ.57, ఎక్స్‌ప్రెస్‌కు రూ.62 చార్జీలుగా నిర్ణయించినట్లు, బస్సు అదనపు వెయిటింగ్ టైమ్ గంటకు రూ.300గా చార్జ్ చేస్తామన్నారు. టోల్ చార్జీలు కలుపుకొని వీటిని నిర్ణయించినట్లు, అయ్యప్ప భక్తులు ఈ సదావకాశాన్ని వినియోగించుకుని ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం చేయాలని ఆర్ఎం కోరారు.